ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 35, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 10, క్యారెట్ 18, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటి కాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 4-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి



తుకారాంగేట్‌లో పోలీసులకు సూచనలు చేస్తున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

అడ్డగుట్ట: నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. తుకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట, మరాఠాబస్తీ, సాయినగర్, బోయబస్తీ, వడ్డెరబస్తీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ స్థానిక ప్రాంతాల గురించి ఆమెకు వివరించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. అర్ధరాత్రి రోడ్లు, బస్తీల్లో సంచరించే అల్లరి మూకలపై చర్యలు తప్పవన్నారు.

సీసీనగర్‌లో ఆధార్ కేంద్రం షురూ



ఆధార్ కేంద్రానికి తరలివచ్చిన ప్రజలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. దీనిద్వారా నూతన ఆధార్ కార్డుల జారీ, సవరణలు చేపట్టారు. స్థానికులు కేంద్రాన్ని సందర్శించి ఆధార్ కార్డుల సవరణలు, ఇతరత్రా పోస్టల్ సేవలను పొందారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిరంజీవి, స్థానిక నాయకులు అబ్దుల్ కరీం, దుర్గేశ్, హరి, మహేశ్, సాయి సందీప్, మునీర్, ఆగస్టీన్, విశాల్, అనిత, పార్సీ మహేశ్, షబానా బేగం, శివ తదితరులు పాల్గొన్నారు.

మేడిబావిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ, జలమండలి అధికారులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లోని మేడిబావి ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జలమండలి సెక్షన్ అధికారి కుషాల్‌తో కలిసి మేడిబావిలోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తాగు నీరు, లోప్రెషర్, కలుషిత జలాలు తదితర ప్రజా సమస్యల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.

మహిళ అదృశ్యం



పునీత

చిలకలగూడ: మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ శ్రీదేవి థియేటర్ ప్రాంతానికి చెందిన పోకల పునీత (36) పుట్టుకతోనే మానసిక వైకల్యానికి గురైంది. 18 ఏళ్ల క్రితం నర్సింగరావుతో వివాహం అయింది. ఈనెల 7న దూద్‌బావిలో ఉంటున్న కుమార్తెను చూసి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో సన్నిహితులు, బంధువుల వద్ద వాకబు చేసి, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో తల్లి కొమరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు.

రోడ్డుకిరువైపులా నిలిపిన వాహనాలు



రోడ్లే పార్కింగ్..!

బహుళ అంతస్తుల భవనాల్లో కానరాని పార్కింగ్ స్థలాలు

- రహదారులకిరువైపులా యథేచ్ఛగా వాహనాల నిలిపివేత
- బౌద్ధనగర్ డివిజన్‌లో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టని అధికారులు

బౌద్ధనగర్: అసలే ఇరుకు రోడ్లు..ఆపై రహదారులకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు బౌద్ధనగర్ డివిజన్ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతుండడం, ఇంకోవైపు బహుళ అంతస్తుల భవనాల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో సమస్య మరింత జఠిలం అవుతున్నది.

బహుళ భవనాలు ఫుల్..పార్కింగ్ నిల్

బౌద్ధనగర్ డివిజన్‌లో వివిధ కాలనీలు, బస్తీలు ఉన్నాయి. గతంలో ఇక్కడ ఇండిపెండెంట్ ఇళ్లే అధికంగా ఉండేవి. అయితే కాలక్రమేణా ఎల్ నారాయణనగర్, బౌద్ధనగర్, అల్లాడి రాజ్‌కుమార్‌నగర్ తదితర ప్రాంతాల్లోని చిన్నిచిన్న స్థలాల్లో కూడా ఇటీవల భారీగా బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. దీనికితోడు కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా దానికి అనుగుణంగా పెరిగింది. అయితే బహుళ అంతస్తుల భవనాల్లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో అందులోని వారు తమ వాహనాలను రోడ్లకిరువైపులా ఇష్టారాజ్యంగా నిలుపుతునాన్నరు. ఇక్కడి రోడ్లు కొన్ని దశాబ్దాల క్రితం వేసినవే ఉన్నాయి. కేవలం 20 అడుగుల రోడ్డులో ఇరువైపులా కార్లు నిలుపుతుండడంతో కనీసం ఆటోలు కూడా వెళ్లే పరిస్థితి నెలకొంటున్నది. ఎప్పుడైనా ఏదైనా ప్రమాదం జరిగినా.. అంబులెన్స్ రావాలన్నా.. గంటల తరబడి ఇబ్బందులు తలెత్తిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలనీల్లో పార్కింగ్ సదుపాయం కల్పించాలి..



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ప్రస్తుతం వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఉస్మానియా యూనివర్సిటీ, ప్రభుత్వ స్థలాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

-బచ్చు విజయ్

రోడ్లకిరువైపులా పార్కింగ్ చేస్తే చర్యలు..



వాహనాలు వచ్చి వెళ్లేందుకు రోడ్లు ఉన్నాయి కానీ సొంత ప్రయోజనాల కోసం కాదు. రోడ్లకిరువైపులా వాహనాలను పార్కింగ్ చేసి ఇబ్బందులు కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. త్వరలోనే జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపడుతాం. ఎవరి సొంత ప్రదేశంలో వాళ్లు పార్కింగ్ చేసుకోవాలి.

– ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్

ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు



ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

కంటోన్మెంట్: ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు కలిగించవద్దని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. మారేడ్‌పల్లిలోని వ్యాపార కేంద్రాలను ట్రాఫిక్ పోలీసులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కోర్ట్ సమీపంలోని ఫుట్‌పాత్‌లపై ఎన్నో ఏళ్లుగా పదులసంఖ్యలో డాక్యుమెంట్ రైటర్లు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఆయా దుకాణాలను తొలగించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుని ఆయా వ్యాపారాలు యధావిధిగా కొనసాగించుకునేలా చూడాలన్నారు. తమ విజ్ఞప్తి మేరకు పర్యటించి సమస్యకు పరిష్కారం చూపడంతో ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. తిరుమలగిరికి చెందిన మహాలక్ష్మికి సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 60 వేలు మంజూరు కాగా సంబంధిత చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిందన్నారు.

ఎన్‌సీసీ ప్రోగ్రాంకు తక్షశిలా పబ్లిక్ స్కూల్ ఎంపిక



కార్యక్రమంలో కల్నల్ రాకేశ్ కుమార్ తదితరులు

లాలాపేట: శాంతినగర్ లాలాగూడలోని తక్షశిలా పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ ప్రోగ్రాంకు తెలంగాణలోని ఐదో బెటాలియన్ కింద ఎంపిక కావడంపై స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో తెలంగాణ ఐదో బెటాలియన్ సీఓ కల్నల్ రాకేశ్ కుమార్, ఎన్‌సీసీ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ యాదవ్ అంకిత భావంతోనే తమ స్కూల్ ఈ మైలు రాయిని సాధించిందన్నారు. రానున్న రోజుల్లో కల్నల్ రాకేశ్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రోగ్రాంను నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వం, సేవా స్ఫూర్తి పెంపొందిస్తుందన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలిస్తున్న అఫ్జల్ తదితరులు

రసూల్‌పురా: విమాననగర్‌కాలనీలోని మమత హైస్కూల్‌లో శనివారం విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ హెల్త్ సూపరింటెండెంట్ అఫ్జల్ మోహినుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై కరస్పాండెంట్ ఇందిరారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచి వారి ఆలోచనలకణుగుణంగా నూతన ఆవిష్కరణలు చేసే దిశగా యాజమాన్యం చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ.. యేటా విద్యార్థులు రూపొందించిన నమూనాలతో సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విమాననగర్ కాలనీ అధ్యక్షుడు రాజేశం, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



స్కిల్ భారత్ శిక్షణ కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ వాణీదేవి, కార్పొరేటర్ మహేశ్వరి

సనత్‌నగర్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. బేగంపేట బ్రాహ్మణవాడీలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ సెంటర్‌లో ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి స్కిల్ భారత్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో తమ కుటుంబానికి ఆసరాగా నిలబడడమే కాకుండా మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. కుట్టు శిక్షణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుంటూ ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ కేంద్రం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. స్కిల్ భారత్ ప్రతినిధి లక్ష్మణ్, కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, కార్డ్ సంస్థ వ్యవస్థాపకులు సుమన్ మల్లాది, మంజులత, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ యాదవ్, నాయకులు శ్రీహరి, రాజయ్య, నరేశ్, రఘు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రమోట్‌కు కృషి

లాలాపేట: సేంద్రియ వ్యవసాయ్యం, వాటి ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు గ్రామభారతి ఎంతగానో కృషి చేస్తున్నదని గ్రామభారతి ప్రాంత ఉపాధ్యక్షుడు పూటుకూరి లింగం అన్నారు. తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో 9వ మూలం సంతను శనివారం ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 70 మందికి పైగా రైతులు, చేతివృత్తుల వారు తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయదారులకు మార్కెట్ సదుపాయన్ని కల్పించడమే దీనికి ముఖ్య ఉద్దేశం అని అన్నారు. వ్యవసాయ, గోఆధారిత, సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు, చేతి వృత్తుల వస్తువులను ప్రజలం దరికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాల్లో సంతలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆర్గానిక్ మిల్లెట్ ఉత్పత్తులు ఐస్‌క్రీమ్, పిజ్జా వంటి ఉత్పత్తులు, వస్తువులు, దవా చాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామభారతి అధ్యక్షురాలు సూర్యకళ, ప్రధాన కార్యదర్శి మోహన్, రాఘవేంద్ర ఉన్నారు.

మహంకాళి ఆలయంలో కోటి కుంకుమార్చన షురూ



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో 5 రోజుల పాటు నిర్వహించే కోటి కుంకుమార్చనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సభ్యులు కిశోర్ కుమార్, రామ్మోహన్ యాదవ్, మహేందర్, అరుణ్‌భట్, ఆనంద్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

సనత్‌నగర్: హనుమాన్ ఆలయం (సెవన్ టెంపుల్స్)లో సామూహిక అఖండ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం శనివారం వైభవంగా జరిగింది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారి మంగళాశాసనములతో ఉదయం 6 గంటలకు ప్రారంభం కాగా సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. శ్రీవిష్ణు సహస్రనామ, సత్సంగ్ సభ్యులతో పాటు భక్తులు హాజరై శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి హాజరై అనుగ్రహ భాషణం చేశారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.

ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు



మీసేవ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: నూతన రేషన్‌కార్డుల జారీ విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తీవ్ర పేర్కొన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు సీతాఫల్‌మండి మీసేవ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డుల కోసం మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం రాత్రి చెప్పిన ప్రభుత్వం శనివారం ఉదయానికే మాటమార్చి ప్రజాపాలన దరఖాస్తులే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌ను ప్రభుత్వం నిలిపివేసినట్లు సిబ్బంది తెలిపారన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, లేకుంటే ప్రజల తరఫున ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు.

అనుమతులిచ్చి రోడ్లు వేయకపోవడం తగదు



ప్రకాశ్‌నగర్‌లో రోడ్డు విషయమై అధికారులతో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: బస్తీల్లో ఇళ్లు, భవనాల నిర్మాణానికి అనుమతిచ్చిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం రోడ్లు వేసేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, జీహెచ్‌ఎంసీ అధికారులు, బస్తీ, కాలనీవాసులతో కలిసి బేగంపేట డివిజన్‌లోని ఎరుకలబస్తీ, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ప్రకాశ్‌నగర్‌లో రోడ్డు వేయవపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన అక్కడే ఉన్న జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డీసీ సమ్మయ్యతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన మీరే ఇప్పుడు బస్తీని చెరువుగా చూపుతూ రోడ్లు వేయడం కుదరదంటే ఎలా అంటూ ప్రశ్నించారు. పెండింగ్ సీసీ రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎరుకలబస్తీలో పూర్తయిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించి స్థానిక బస్తీవాసులకు అప్పగించారు. బేగంపేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ యాదవ్, శ్రీహరి, రాజయ్య, మాతాజీనగర్ గంగారం, రఘు పాల్గొన్నారు.

సైఫాబాద్ పీజీ కాలేజీ అధ్యాపకుల నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరర్ అసోసియేషన్ (టీజీ-ఏయూపీటీఏ) ఓయూ అనుబంధ సైఫాబాద్ పీజీ కాలేజీ కమిటీని ప్రకటించారు. శనివారం ఓయూలో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ టి.శేఖర్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.వెంకట్, కోఆర్డినేటర్‌గా డాక్టర్ పి.లక్ష్మీరెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి డా.ఎర్రం నాగేందర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు



అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేయగా మరో యువకుడు పారిపోయాడు. నిందితుడి నుండి 1.132 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారనే అందిన సమాచారం మేరకు ఎస్టీఎఫ్‌టీం శనివారం దాడులు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై గంజాయితో వెళ్తున్న సయ్యద్వాజిద్ రుమాన్‌ను పట్టుకుని గంజాయితో పాటు సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. యూసుఫ్‌గూడకు చెందిన మరొకరు ఎండీ అజార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా పరారీలో ఉన్న అజార్ ద్వారా గంజాయి సేకరించి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ కోసం కేసును అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఎస్టీఎఫ్ టీం సీఐ భిక్షారెడ్డి, ఎస్సైలు బాలరాజు, సంధ్య, కానిస్టేబుల్ సంతోష్, లక్ష్మణ్, అనిష్ నితీన్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

నర్సింగ్ విద్యార్థిని మృతి కేసులో నిందితుడి అరెస్టు

బౌద్ధనగర్: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న కేసులో వారాసిగూడ పోలీసులు నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బౌద్ధనగర్ అంబర్‌నగర్‌కు చెందిన ప్రవళిక (23) సృజన్ (25) నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రవళిక కోఠి ఉమెన్స్ కాలేజ్‌లో బీఎస్సీ నర్సింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ప్రియుడు సృజన్ కొద్ది రోజుల నుంచి ప్రవళికను అనుమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం ఆత్మహత్య చేసుకున్నది. ఈ కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపుపై శ్రేణుల సంబురాలు



జేబీఎస్ చౌరస్తాలో సంబురాల్లో బీజేపీ నాయకులు



వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో బీజేపీ నాయకులు శనివారం పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆప్ నాయకుల అవినీతి పాలనతో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారని, మార్పు కోరుకుంటూ ప్రధానమంత్రి మోదీపై నమ్మకంతో బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



తుకారాంగేట్‌లో సుభాష్ బొమ్మ వద్ద ..



సనత్‌నగర్ స్వామి సోలిటేర్ అపార్ట్‌మెంట్ వద్ద ..



రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో..



తార్నాకలో ..